క్లుప్తంగా

స్వాతంత్ర్య సమరయోధుడి మృతి

ఎల్కతుర్తి : మండల కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు పోతు ఆదిరెడ్డి (95) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో రజాకార్లకు వ్యతిరేఖంగా పోరాడారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష

ఆత్మకూరు : డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కిన నలుగురికి పరకాల జడ్జి శాలిని లింగం నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ రవిరాజు తెలిపారు. శనివారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని తిరుమలగిరికి చెందిన మోరె నగేష్, కొత్తగట్టుకు చెందిన కంప రాజేందర్, హౌజ్ బుజుర్గుకు చెందిన ఎస్కే కరీం, శాయంపేటకు చెందిన మారెపెల్లి విజేందర్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా నగేష్‌కు నాలుగు, కంప రాజేందర్‌కు, కరీం, విజేందర్‌లకు రెండ్రోజులు చొప్పున జడ్జి జైలు శిక్ష విధించినట్లు సీఐ వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన బండి సదయ్యకు అతడి తల్లి ఐలమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో శ్రీ సంజీవ ఆంజనేయ భజన మండలి ప్రతినిధులు ఆయన సభ్యుడు కావడంతో శనివారం ఆర్థికసాయం అందించారు. తొలుత ఐలమ్మ కుటుంబాలను భజన మండలి సభ్యులు పరామర్శించారు. కార్యక్రమంలో భజన మండలి జిల్లా అధ్యక్షుడు మాదాడి రాజు, సభ్యులు మాచర్ల వెంకటేష్, వైద్యుల ప్రభాకర్‌రెడ్డి, తడుక సదానందం, రవి, రాజు, శ్రీధర్, మహేందర్, రాంరెడ్డి, కుమారస్వామి, సాంబరెడ్డి, మల్లయ్య, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

పరామర్శ

కాజీపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటిలో చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమకారుడు కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీకి చెందిన పాము రాజేష్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు సుంచు కృష్ణ, కల్పలత సూపర్ బజారు డైరెక్టర్ అయ్యాల దానం, బీఆర్‌ఎస్ నాయకులు వెనిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గీసుకొండ : మండల కేంద్రంలో ప్రపంచ మానవత్వపు దినోత్సవం సందర్భంగా ఆపద్బాంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలోని సానపెల్లి ఎలీషా పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తుండగా ఆమె భర్త కట్టయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఫౌండేషన్ ప్రతినిధి కర్ణకంటి రాంమూర్తి, సర్పంచ్ బాబు రూ. 50 కిలోల బియ్యం, ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులను వారికి పంపిణీ చేశారు.

రేపటి నుంచి సంచార వైజ్ఞానిక ప్రదర్శన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 21వ తేదీ నుంచి సంచార వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వింధ్యారాణి తెలిపారు. సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయోలజీ (సీసీఎంబీ) హైదరాబాద్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం బెంగుళూర్ సౌజన్యంతో మొబైల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. హసన్‌పర్తి మండలంలోని పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులతోపాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రారంభోత్సవానికి ఆర్‌సీఓ వింధ్యారాణి, కార్పొరేటర్ శివకుమార్, తహసీల్దార్ ప్రసాద్, తదితరులు హాజరవుతారని తెలిపారు.

ప్రాంగణ నియామకాలు

కేయూ క్యాంపస్: కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌లోని 'సమ్ పాజిటివ్ కంపెనీ' శనివారం ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్ తెలిపారు. విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్), మహిళా ఇంజనీరింగ్ కళాశాల, తాళ్ల పద్మావతి కళాశాలకు చెందిన 150 మంది సీఎస్సీ, ఐటీ విద్యార్థులు పాల్గొనగా, 41 మంది 'ఏ' రౌండ్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వారికి 6నెలలపాటు ఇంటర్న్‌షిప్, అనంతరం రూ.4లక్షల వార్షిక వేతనం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమణబాబు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఓటేయడం సామాజిక బాధ్యత

పరకాల : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని సామాజిక బాధ్యతగా స్థానిక ఏసీపీ కిశోర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి అభివర్ణించారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయం నుంచి జూనియర్ కాలేజీ వరకు శనివారం ఉదయం 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ, మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. 18 ఏళ్ల వయస్కులైన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



పరకాల : ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీపీ, మున్సిపల్ కమిషనర్, తదితరులు

ఓటు వజ్రాయుధం లాంటిది

ఎల్కతుర్తి : ఓటు ప్రజాయుధం లాంటిదని తహసీల్దార్ వెంకటభాస్కర్ తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేలా మండల కేంద్రంలో శనివారం తలపెట్టిన 5కే రన్‌ను ఎంపీపీ జక్కుల అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. అర్హులందరూ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటేసి సరైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై సాయిబాబు, సర్పంచ్ సాతూరి స్వాతి, ఎంపీటీసీ సాతూరి రమ పాల్గొన్నారు.


భీమదేవరపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

'కడియం ఎన్‌కౌంటర్ల సృష్టికర్త'

ధర్మసాగర్ : మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి దేవాదుల సృష్టికర్త కాదని, ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అని వేలేరు ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం, వేలేరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అనుచరులు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను డాక్టర్ తాటికొండ రాజయ్యకే ఇవ్వాలని కోరుతూ శనివారం ధర్నా నిర్వహించారు. కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ సరిత మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్యే రాజయ్య అధికార కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే పదవిని త్యజించారని గుర్తు చేశారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాదిగ సామాజిక ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న క్రమంలో ఆ సామాజికవర్గానికి చెందిన రాజయ్యకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ అధిష్టానాన్ని కోరారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి నియోజకవర్గంలో ప్రజల మద్దతు లేదని చెప్పారు. ప్రజలంతా ఎమ్మెల్యే రాజయ్యకు వెన్నంటే ఉన్నారని, పలు సర్వేలు కూడా రాజయ్య గెలుస్తాడని వెల్లడించాయని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. కడియం శ్రీహరి మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి లేదని, అమాయకులను ఎన్‌కౌంటర్ చేయించాడని ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మరిజె నర్సింగరావు, మండల కోఆప్షన్ సభ్యులు జానీ, మండల సమన్వయకర్త రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మిరెడ్డి

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ధర్మసాగర్ : ఐక్యపోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల నాయకుడు బట్టు మల్లయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల మహాసభకు భిక్షపతి హాజరై మాట్లాడారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, నిలువ నీడ, ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు రైతన్న ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీదే ఉందన్నారు. దారిద్రరేఖకు దిగువన సుమారు 40 కోట్ల మంది ప్రజలు రెండు పూటలా తిండి దొరకని దుస్థితిలో అల్లాడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఉపాధి లేక యువత ఇతర దేశాలకు, నగరాలకు వలస పోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాదంతో ప్రజల్లో చిచ్చు పెట్టేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఆదివాసీ, గిరిజన, మైనార్టీ, దళితులపై దాడులు ఎక్కువయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దళితబంధు, పేదలకు ఇండ్ల స్థలాలు, తదితర అనేక హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కొట్టె వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా గోకుల రాజయ్య, కనకట రాజయ్య, కోశాధికారిగా రాజారపు రత్నంతోపాటు 16 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. మహాసభలో పార్టీ జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, శంకర్ నాయక్, మర్రిపెల్లి అంకూస్, చిలుక బాబు, దేవదాసు, రాజిరెడ్డి, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

'గృహలక్ష్మి'కి 2,388 మంది అర్హులు

ఆత్మకూరు : గృహలక్ష్మి పథకానికి మండలంలో 2,388 మందిని అర్హులుగా గుర్తించినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. మండలంలో గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని తెలిపారు. అగ్రంపహాడ్‌లో 112, అక్కంపేటలో 306, ఆత్మకూరులో 321, చౌళ్లపెల్లిలో 195, గుడెప్పాడ్‌లో 81, హౌజుబుజుర్గులో 182, కామారంలో 136, కటాక్షపూర్‌లో 55, కొత్తగట్టులో 74, లింగమడుగుపల్లెలో 34, మల్కపేటలో 124, నాగయ్యపల్లెలో 45, నీరుకుళ్లలో 305, పెద్దాపూర్‌లో 232, పెంచికలపేటలో 161, తిరుమలగిరిలో 25 మందిని అర్హులుగా గుర్తించినట్లు వివరించారు. అర్హుల జాబితానను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపనున్నట్టు పేర్కొన్నారు.

రక్తదానం



శాయంపేట : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ నగరంలోని కేఎస్ఆర్ గార్డెన్‌లో జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన శిబిరంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు పైడిమల్ల సుధాకర్, మాజీ అధ్యక్షుడు పల్లెబోయిన వెంకటేష్ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్, వెంకటేష్‌లకు సంఘం జిల్లా నాయకులు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు సూర్యదేవర భిక్షపతి, కుమార్, వినోద్, మూర్తి, పాషా పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతే పీటీఎం ధ్యేయం


మాట్లాడుతున్న హెచ్ఎం లింగారావు

ఐనవోలు : విద్యార్థి ఉన్నతే ధ్యేయంగా ప్రతినెలా మూడో శనివారం పేరెంట్–టీచర్ మీట్ (పీటీఎం) నిర్వహిస్తున్నట్లు ఉడుతగూడెం గ్రామంలోని ప్రభుత్వ స్కూల్ హెచ్ఎం చుంచుకాల లింగారావు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం పీటీఎం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉడుతగూడెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం లింగారావు మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా వర్క్‌బుక్స్ అందిస్తోందని తెలిపారు. వారానికి మూడ్రోజుల పాటు రాగి జావ అందిస్తున్నట్లు చెప్పారు. పీటీఎం నిర్వహించే రోజున విద్యార్థులు బ్యాగులు తెచ్చుకోవాల్సిన అవసరం లేదని, ఆ రోజును నో బ్యాగ్ డేగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించినట్లు చెప్పారు. విద్యార్థులు చదువుకుంటున్న తీరు, ఏవైనా లోటుపాట్లుంటే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకొచ్చేలా కార్యక్రమం ఉపకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రతికంఠం ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్ కొండేటి ప్రణీత, పేరెంట్స్ ఇల్లందుల రాజు, బరిగల చింటు, యాకర ప్రియాంక, మిద్దెపాక మమత, గ్యాదర పింకీ, ఇల్లందుల యాకాంత, ఆకులపెల్లి రవి, తాటికాయల అనిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గుంత పూడ్చివేత


గుంతను పూడ్చుతున్న గ్రామస్తులు

ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలోని హన్మకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై నున్న వాగు వంతెనపైన ఏర్పడిన గుంతను గ్రామస్తులు శనివారం పూడ్చివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ గుంత ఏర్పడి పలువురు గాయాల పాలయ్యారు. రెండ్రోజులుగా వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం ఓ లారీని వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు గాయాలు కానప్పటికీ సర్పంచ్ రజిత దేవేందర్‌రావు స్పందించారు. వెంటనే ట్రాక్టర్‌లో రెడీమిక్స్ కంకర తెప్పించి రోడ్డుపై ఏర్పడిన గుంతకు గ్రామస్తుల సాయంతో తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతను పూడ్చి నాణ్యమైన రోడ్డు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో రవి, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ మినీ వ్యాన్ దగ్ధం


దగ్ధమవుతున్న మినీ స్కూల్ వ్యాన్


విచారణ చేస్తున్న పోలీసులు

కమలాపూర్ : మండలంలోని కానిపర్తి గ్రామంలో ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన మినీ వ్యాన్ శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ మినీ వ్యాన్‌ను డ్రైవర్ ప్రతీరోజు సాయంత్రం కానిపర్తి బస్టాండ్ సమీపంలో పార్క్ చేస్తాడు. రోజు మాదిరిగానే శుక్రవారం సాయంత్రం వ్యాన్‌ను పార్క్ చేశాడు. అర్ధరాత్రి సమయంలో మినీ వ్యాన్‌కు నిప్పంటుకుని మంటలు వ్యాపించగా వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకుని ఇన్‌స్పెక్టర్ సంజీవ్ పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. దగ్ధమైన వ్యాన్‌ను పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ వల్లే వ్యాన్ దగ్ధమైందా? లేక ఎవరైనా నిప్పంటించారా? అనేది తెలియరాలేదు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పాఠశాలల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శనం తదితరులు

ఆత్మకూరు : మండలంలోని ఆత్మకూరు, చౌళ్లపెల్లి, అక్కంపేట, పెద్దాపూర్, నీరుక్కుల గ్రామాల్లో శనివారం డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుదర్శనం మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీని వెంటనే ప్రకటించి, మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో తొలి పీఆర్సీ జాప్యం కావడంతో ఉద్యోగులు, పెన్షనరు నష్టపోయారని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ , ఇతర బోధన, బోధనేతర ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంతోపాటు బదిలీలు చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి భారతి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి జి.సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ జన్మదిన వేడుక



ధర్మసాగర్ : హనుమకొండలోని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి నివాసంలో ధర్మసాగర్ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ జన్మదిన వేడుక శనివారం నిర్వహించారు. శరత్‌తో కడియం శ్రీహరి కేక్ కట్ చేయించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, కడియం యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

ధర్మసాగర్ : సెప్టెంబర్ 10న తలపెట్టిన నవనాగ యజన పురస్సర నక్షత్రారామ ప్రతిష్ఠకు హాజరు కావాల్సిందిగా కోరుతూ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఎంపీడీఓ జవహర్‌రెడ్డితో కలిసి ఆలయ ట్రస్ట్ చైర్మన్ గంట పవన్ శర్మ శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం పవన్ శర్మ మాట్లాడారు. మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులోని నవనాగ క్షేత్రంలో శ్రీ భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో నవనాగ యజన పురస్సర నక్షత్రారామ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక కళ్యాణార్థం తలపెట్టిన మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


ఆహ్వానపత్రికతో కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిటీ ట్రస్ట్ చైర్మన్ పవన్ శర్మ

27న టీటీసీ అభ్యర్థులకు పరీక్షలు

విద్యారణ్యపురి : జిల్లాలో 42రోజుల టీటీసీ సమ్మర్ ట్రెనింగ్ కోర్సులో ఈ ఏడాది జూన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ లోయర్ గ్రేడ్ థియరీ ఎగ్జామినేషన్‌కు ముందు పరీక్షల్లో ఫెయిల్ అభ్యర్థులకు ఈనెల 27న పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై శనివారం తెలిపారు. 27న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు (ఎడ్యుకేషనల్ సైకాలజీ అండ్ స్కూల్ అడ్మినిస్ట్రేషన్), మధ్యాహ్నం 2గంటల నుంచి 3గంటల వరకు (మెథడ్స్ ఆఫ్ టీచింగ్ జనరల్), మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు (మెథడ్స్ ఆఫ్ టీచింగ్ స్పెషల్) పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా పరీక్షలు రాసే అభ్యర్థులు ట్రెనింగ్ సెంటర్ పేరు, ట్రేడ్ పేరు, అభ్యర్థి పేరు టైప్ చేసి వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడు చేసుకోవచ్చని డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

కాజీపేట: ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్ మాట్లాడారు. రానున్న రోజుల్లో బూత్ లెవల్‌లో పనిచేయాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. అనంతరం, ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బొమ్మల అశోక్‌తోపాటు పలువురిని విజయ్‌భాస్కర్ సన్మానించారు. సమావేశంలో కార్పొరేటర్లు ఎలకంటి రాములు, సంకు నర్సింగ్, నాయకులు కాటపురం రాజు, సుంచు కృష్ణ, మిట్టపల్లి రవీందర్, రంజిత్‌కుమార్, ఎండీ.సోని, మహమూద్, ఫర్వీన్ ఖాన్, సయ్యద్ యాకుబ్, మర్యాల కృష్ణ, లారెన్స్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కమలాపూర్ : స్థానిక తహసీల్దార్‌గా గతంలో పని చేసి బదిలీపై వెళ్లిన పాలెపాక రాణికి ఇక్కడ పని చేసిన సందర్భంగా ఆమె పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకోగా ఇన్‌స్పెక్టర్ సంజీవ్ ఆమె నివాసంలో కలిసి శనివారం ఆమెకు అప్పగించారు. వివరాలిలా.. మండలంలో తహసీల్దార్‌గా పని చేసిన పాలెపాక రాణికి చెందిన రూ.24 వేల విలువైన సెల్‌ఫోన్ విధులకు హాజరయ్యేందుకు వస్తున్న క్రమంలో మూడు నెలల క్రితం పోయింది. ఈ క్రమంలో ఆమె పోలీసు శాఖ కేటాయించిన పోర్టల్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. ఆమె పోగొట్టుకున్న సెల్‌ఫోన్ హనుమకొండ నయీంనగర్‌కు చెందిన యువకుడి వద్ద ఉన్నట్టు గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకుని ఆమె ఇంటి వద్ద ఇన్‌స్పెక్టర్ సంజీవ్ అందజేశారు.


తహసీల్దార్ రాణికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సంజీవ్

రెవెన్యూ నక్షా ప్రకారం పనులు చేపట్టాలి

హసన్‌పర్తి: రెవెన్యూ నక్ష ప్రకారం నాలాలను గుర్తించి వాటి విస్తరణ పనులు చేపట్టాలని వరద ముంపు పరిష్కార సాధన సమితి అధ్యక్షుడు నవీన్ కుమార్ ప్రభుత్వాన్ని, బల్దియా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సాధన సమితి సమావేశం శనివారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ నక్షను పరిగణలోకి తీసుకుని నీటి పారుదల, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టి నాలాను గుర్తించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నాలా అశాస్త్రీయంగా ఉందని వాపోయారు. 2008వ సంవత్సరంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఇచ్చిన ప్రకటన మేరకు నాలాను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సభ్యులు మానుపాటి రవి, శ్రవణ్, సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట రూరల్: ప్రజాకవి గద్దర్, సియాసిత్ ఉర్దూ పత్రిక సంపాదకుడు జహీరుద్దీన్ అలీఖాన్‌ల సంస్మరణ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కాజీపేటలోని రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆవరణలోని కాకతీయ కళా వేదికలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రైల్వే ఓబీసీ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్ మాట్లాడారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభను మంగళవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, డీజిల్ షెడ్ చైర్మన్ పాక వేదప్రకాష్, కోకన్వీనర్లు భాస్కర్, రవీందర్, శ్రీనివాస్, మాధవరావు, నాగేష్, సుధాకర్, రాజయ్య, లక్ష్మీనారాయణ, దేవిప్రసాద్, రమాకాంత్, అయోధ్య, నవాబ్‌జాఫర్, సారంగపాణి, సత్యనారాయణ, వెంకటమల్లు, నర్సయ్య పాల్గొన్నారు.